
# వాగ్దానం

## దానం ఉమాదేవి




"రాజారావ్"

"......"

"రాజారావ్"

"......."

ఈసారి గట్టిగా పిల్చాడు ముకుందరావు.

"ఆ..." అంటూ ఈ లోకంలోకి వచ్చాడు రాజారావు.

"ఏమిటా పరధ్యానం. దేని గురించో ఆలోచిస్తున్నట్లున్నావు"

"ఏమీ లేదు సార్"

"నాలుగు రోజుల నుండి అదోలా ఉంటున్నావు. ఏమైనా ఇబ్బందులా? సెలవుకావాలా?"

"అదీ..." అంటూ నసిగాడు రాజారావు.

"ఫర్వాలేదు చెప్పు" అనునయంగా అడిగాడు ముకుందరావు.

"మా పెద్దమ్మాయికి పెళ్ళి కుదిరింది సార్. పెళ్ళి చేయలేనేమోనని భయం. అంత డబ్బు నా దగ్గర లేదు. ఏం చేయాలో అర్థం కావటం లేదు"

"ఎంత ఖర్చవుతుంది. నీ దగ్గరెంతుంది"

చెప్పాడు రాజారావు.

ముకుందరావుకు మూడు రైస్ మిల్లులున్నాయి. ఇతరత్రా వ్యాపారాలు కూడా ఉన్నాయి. రాజారావు ఆ రైస్ మిల్లుల అకౌంట్స్ చూస్తుంటాడు. ముకుందరావు దగ్గర పదిహేనేళ్ళ నుండి పనిచేస్తున్నాడు. నమ్మకస్తుడు. ధాన్యం కొనుగోళ్ళప్పుడు లక్షల్లో బిజినెస్ జరుగుతుంది. అదంతా రాజారావు ఆధర్యంలోనే జరుగుతుంది. రైతులకూ రాజారావు మాటంటే నమ్మకమే. ఒక్కోసారి మిగతా బిజినెస్ వ్యవహారాల్లో మునిగి రైస్ మిల్లుల బాధ్యత పూర్తిగా రాజారావుకే వదిలేస్తాడు ముకుందరావు. ముకుందరావు ఇంట్లో ఏ ఫంక్షనైనా రాజారావు లేనిదే జరుగదు. సమయానికి తిండీ తిప్పలూ కూడా లేకుండా పనిచేస్తాడు. ఒక రకంగా చెప్పాలంటే పని చేయిస్తాడు. అతడికి ఒక పని అప్పచెబితే సమయానికి ఠంచనుగా జరిగిపోవాల్సిందే.

కానీ రాజారావుకి ఇచ్చే జీతం మాత్రం పదివేలలోపే. ఆమాత్రం జీతం కూడా ఈమధ్యనే. రాజారావుకు ఇద్దరాడపిల్లలు. డిగ్రీ చదివిన పెద్దకూతురికి ఈమధ్యనే ఒక సంబంధం కుదిరింది. పిల్లవాడు ఒక ప్రైవేట్ కంపెనీలో నెలకు పదిహేనువేలు సంపాదిస్తున్నాడు. యాభై వేలు కట్నం. పిల్లవాడికి ఉంగరం, అమ్మాయికి గొలుసు పెట్టమన్నారు. ఎప్పుడో చేయించిన సన్నగొలుసు ఉంది. అది పెడితే సరిపోతుంది అనుకున్నాడు రాజారావు. రాజారావు ఆర్థిక పరిస్థితి తెలిసిన బావమర్ది రంగారావు ఉంగరం తాను చేయిస్తానన్నాడు.

ఇక కట్నం సమకూరాలి. రాజారావు తినీతినక కూడబెట్టిన సొమ్ము ముప్పై వేలున్నది. అతడి వాటాగా వచ్చిన అరసెంటు స్థలాన్ని తాను కలుపుకొని ఇరవై వేలిస్తానన్నాడు రాజారావు అన్న. ఆ స్థలం పల్లెటూరులో ఉన్నందువల్ల అంత ధర ఇవ్వటమే ఎక్కువ.

కట్నకానుకల వరకు సమకూరింది. మరి పెళ్ళి ఖర్చుల మాటో. అదే రాజారావు వేదనకు కారణం. మగపెళ్ళి వాళ్ళు ఒక యాభై మంది రావొచ్చు. తన తరపు బంధువులో యాభైమంది. ఊర్లో మరీ ముఖ్యలనుకున్న వాళ్ళనే పిలిచినా మరో యాభైమంది అవుతారు. మొత్తం నూటయాభైమంది. వీళ్ళందరికీ కాఫీలు, టిఫిన్లు రెండు పూటలా భోజనాలంటే మాటలా! ఫంక్షన్ హాలు తీస్కుని పెళ్ళి చేయటమనేది కల్ల. ఇంటిముందు పందిరేసి చేయాలన్నా తన ఇల్లు చిన్నపెంకుటిల్లు. ఇరుకైన రోడ్డు. పెళ్ళి ఎక్కడ చేయాలి? ఆ డబ్బు ఎక్కడ తేవాలి?

"ఊర్లో ఉన్న మన రైస్‌మిల్లు పెద్దది కదా! చుట్టూ ఖాళీ జాగా కూడా చాలా ఉన్నది. అక్కడ పందిరి వేసి పెళ్ళి చెయ్. కొత్త ధాన్యం వచ్చి కొనుగోలు చేసేదాకా గదులు కూడా ఖాళీగానే ఉంటాయి. అందులోని బస్తాలు హాల్లోకి మార్చు. పెండ్లివాళ్ళకు గదులివ్వొచ్చు. పెళ్ళి ఆదివారం కాబట్టి మిల్లు మొత్తం ఉపయోగించుకోవచ్చు. కరెంట్ సమస్యా లేదు. వాటర్ కనెక్షన్ ఉంది. కళ్యాణమంటపం ప్రాబ్లమ్ తీరినట్లే" ముకుందరావు అన్నాడు.

కాసేపటిదాకా రాజారావు ఏమీ మాట్లాడలేదు.

"పెళ్ళి ఖర్చు మాటేమిటి? కళ్యాణ వేదిక ఉంటే సరా?"

"ఏమిటి మాట్లాడవు"

"సార్! పెళ్ళి ఖర్చులకి కొంత మొత్తం అప్పుగా ఇస్తే నెల నెలా కొంత చొప్పున తీరుస్తా"

"ఆ డబ్బు తిరిగి ఎప్పటికి చెల్లిస్తావ్. నీకొచ్చే జీతం నీ కుటుంబ ఖర్చులకే అంతంత మాత్రంగా సరిపోతుంది"

రాజారావు ఏమీ మాట్లాడకుండా తలవంచుకుని నిల్చున్నాడు. తన బతుక్కు అప్పు కూడా పుట్టదు.

"పెళ్ళి ఖర్చు నేను పెట్టుకుంటాను. తిరిగి ఇవ్వనక్కరలేదు. ఎంతవుతుంది" అన్నాడు ముకుందరావు, రాజారావు భుజమ్మీద చెయ్యేసి.

రాజారావు ఊహించని సాయం అది. ఆనందంతో మాట పెగలక యజమానికి చేతులెత్తి దండం పెట్టాడు.

"పాతిక వేలు అవుతుందేమో" అన్నాడు గొంతు పెగల్చుకొని.

"అయినా ఫర్వాలేదు. అనుకున్నదానికన్నా ఎక్కువైనా ఇస్తా. ఇదికాక ఐదువేలతో నీ కూతురికి మంచి పట్టుచీర కూడా కొను. డబ్బిస్తా"

రాజారావు, ముకుందరావు చేతులు పట్టుకొని కళ్ళకద్దుకున్నాడు.

"మీ అంత మంచిమనిషి మరొకరు ఉండరు"

"పనులు మొదలుపెట్టుకో. ఎప్పుడు డబ్బు కావాలన్నా ఇస్తా"

"వచ్చే బుధవారం నుండి పనులు మొదలుపెడదామనుకుంటున్నాను. అప్పుడు తీసుకుంటాను"


అన్నాడు రాజారావు.

సరేనన్నాడు ముకుందరావు.

ఆరోజు రాత్రి భార్య వర్ధనమ్మతో రాజారావుకు తాను చేస్తానన్న సాయం గురించి చెప్పాడు ముకుందరావు.

"ఇంటి పని, మిల్లు పని ఏది అయినా చక్కగా చేస్తాడు. పేదపిల్ల పెళ్ళికి సాయపడటం మంచిదేగా" అన్నది వర్ధనమ్మ.

"రాజారావు చేస్తున్న పనితో పోలిస్తే అతనికిచ్చే జీతం తక్కువే. పైగా నమ్మకస్తుడు. పాపం నన్ను అప్పడగటానికి కూడా చాలా బిడియపడ్డాడు. అతడ్ని చూస్తే జాలివేసింది. అందుకే సాయం చేస్తానన్నాను" అన్నాడు ముకుందరావు.



"పోనీలేండి. ఆ సాయం మనకో లెక్కలోది కాదు. ఈసారినుండి జీతం కూడా పెంచండి. అంత నమ్మకస్తుడు మళ్ళీ మీకు దొరకటం కష్టం"

భార్య మాటలకు 'సరే, చూద్దాంలే' అంటూ నిద్ర కుపక్రమించాడు ముకుందరావు.

నాలుగు రోజులు గడిచిపోయాయి. మరుసటి రోజు వెళ్ళి ముకుందరావు దగ్గర డబ్బు తీసుకోవాలి అనుకుంటుండగా పిడుగులాంటి వార్త రాజారావు చెవినపడింది.

ఆరోజు తెల్లవారుఝామున గుండెపోటుతో ముకుందరావు మరణించాడు. మొదట కూతురి పెళ్ళి ఎట్లా అన్న ఆలోచన మెదిలింది రాజారావు మనసులో. తరువాత మంచి మనసున్న వ్యక్తి త్వరగా ఈ లోకాన్ని వీడిపోయినందుకు బాధపడ్డాడు.

వార్త తెలిసిన వెంటనే క్షణం ఆలస్యం చేయకుండా యజమాని ఇంటికి బయల్దేరాడు. అప్పటికే ఇంటి నిండా జనం. దారి చేసుకుని లోపలకు వెళ్ళాడు. హైదరాబాద్‌లో ఉంటున్న ఇద్దరు కొడుకులు కూడా అప్పుడే వచ్చినట్లున్నారు. ముకుందరావు భౌతికకాయం సమీపానికి వచ్చి చేతులు కట్టుకొని నిలబడ్డాడు రాజారావు.

"నీ కూతురి పెళ్ళి తన చేతుల మీదుగా చేస్తానన్నారు. ముందే వెళ్ళిపోయారయ్యా" అన్నది ఏడుస్తూ వర్ధనమ్మ రాజారావును చూస్తూ.

"దేవుడు మంచివాళ్ళను త్వరగా తీసుకుపోతాడేమో! సార్ లేరన్న విషయం జీర్ణించుకోలేకపోతున్నానమ్మా" అన్నాడు రాజారావు కళ్ళు తుడుచుకుంటూ.

బంధువులు, తోటి వ్యాపారస్తులు, మిల్లులో పని చేసే సిబ్బంది సమక్షంలో ముకుందరావు అంతిమ యాత్ర ఘనంగా జరిగింది. తాహతుకు మించి ఐదు వందలు వెచ్చించి ఒక పూలదండ కొని భౌతిక కాయం మీద ఉంచి

శ్రద్ధాంజలి

ఘటించాడు రాజారావు. ఏర్పాట్లు మొత్తం దగ్గరుండి చూశాడు. అంతిమయాత్ర అనంతరం, ముకుంద రావు బంధువులందరికీ హోటల్ నుండి భోజనం వచ్చేలా చేశాడు రాజారావు. అందరూ భోజనాలు చేశారు రాజారావు తప్ప, ఎవ్వరూ అతనిని భోజనానికి పిలవలేదు. వర్ధనమ్మ వద్దన్నా పెద్దకోడలు బలవంతంగా ఆమెకు రెండు ముద్దలు తినిపించింది.

"మళ్ళీ రేప్పొద్దున్న వస్తానమ్మా" అన్నాడు వర్ధనమ్మ దగ్గర సెలవు తీసుకుంటూ.

"భోంచేశావా"

"ఆకలి లేదమ్మా" అంటూ వెళ్ళిపోయాడు.

చనిపోయింది స్వంత వ్యక్తి అయినా తామందరూ ఎంగిలిపడ్డారు. కానీ పొద్దుటినుండీ క్షణం తీరిక లేకుండా వుండి కూడా రాజారావు భోంచెయ్యలేదు. ఆకలి లేకపోవటం కాదు. ఎవ్వరూ అతనిని పిలవలేదు. పట్టించుకోలేదు. ఆ విషయం చెప్పకుండా ఆకలి లేదన్నాడు. పాపం పొద్దుటి నుండి వస్తున్నాడు. నొచ్చుకున్నది వర్ధనమ్మ.

మర్నాడు ఉదయం ఏడు గంటలకే వచ్చాడు రాజారావు.

"చెప్పండమ్మా! ఏం చేయమంటారు?" అన్నాడు వర్ధనమ్మ వైపు చూస్తూ.

"చూడు రాజారావు, కర్మకాండలు జరిపిస్తున్నట్లు కార్డులు అచ్చు వేయించాలి. ఇంటికి సున్నాలు వేయించాలి. మా తరఫున వెళ్ళి ఊర్లో తెలిసిన వాళ్ళందర్నీ పిలవాలి. సరుకులు వగైరా తెచ్చివ్వాలి. ఇక్కడ ఏర్పాట్లన్నీ చూడాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ పన్నెండు రోజులూ నీకిక్కడే పని" చెప్పాడు ముకుంద రావు పెద్దకొడుకు వినయ్.

ఆజ్ఞాపిస్తున్నట్లుగా చెప్పటం వర్ధనమ్మకు నచ్చలేదు.

"పిల్లలకు వాళ్ళు చేయాల్సిన పనులు వాళ్ళకుంటాయి. కాబట్టి నీ చేతుల మీదుగా ఏర్పాటు జరిగితే మీ సార్ ఆత్మ కూడా సంతోషిస్తుంది" అన్నది.

"మీరు ప్రత్యేకంగా చెప్పాలా అమ్మా! అది నా బాధ్యత" అన్నాడు రాజారావు.

సమయానికి అన్నీ అమరేలా చూస్తున్నాడు. అతని మనసులో మాత్రం కూతురి పెళ్ళి గురించిన ఆలోచనలే. ఇక్కడి తతంగమంతా పూర్తయిన తరువాత మార్వాడీ సేఠ్ దగ్గర అప్పు దొరుకుతుందేమో ప్రయత్నించాలి.

కర్మకాండల తతంగం అంతా పూర్తయింది. బ్రాహ్మణులకు దానాలు, అన్న సంతర్పణ జరిగింది. పదమూడోరోజు బంధువులందరూ వెళ్ళిపోయారు. ముకుందం కొడుకులు రైస్ మిల్లులకు వచ్చి రికార్డులు తనిఖీ చేశారు. తమకు రావలసిన బకాయిలు వగైరా వివరాలు రాజారావునడిగి తెలుసుకున్నారు.

ఇంట్లో బీరువాలో తండ్రి దాచిన కాయితాలన్నింటిని పరిశీలించారు. కొన్ని అప్పులు కూడా ఉన్నాయని అర్ధమైంది. ఇక్కడి స్థిరాస్తులు అమ్మి తల్లిని తమతో తీస్కెళ్ళాలని ఉన్నా, ప్రస్తుతం మంచి ధర రాదన్న అనుమానంతో తమ ఆలోచన బయటపెట్టలేదు.

ఆరోజు రాత్రి భోజనాల సమయంలో కొడుకుల దగ్గర రాజారావు ప్రస్తావన తెచ్చింది వర్ధనమ్మ.

"చాలా నమ్మకస్తుడు. పైగా మీ నాన్న పెళ్ళి ఖర్చిస్తానని మాటిచ్చారు. పెళ్ళికి ఎన్నో రోజులు లేదు. అంత్యక్రియలు వగైరా పనులలోనే ఇన్నాళ్ళూ ఉన్నాడు. రేపు ఆ డబ్బిస్తే పెళ్ళి ఏర్పాట్లు చేసుకుంటాడు"

"కర్మకాండలకే లక్షలు ఖర్చయ్యాయి. మళ్ళీ అదనంగా ఇదో కటా" అసహనంగా అన్నాడు వినయ్.

"నాన్న ఏదో సాయం చేస్తాడని పెళ్లి కుదుర్చుకోలేదు కదా! అయినా పెళ్ళిఖర్చంటే మాటలా" అన్నాడు రెండో కొడుకు విజయ్.

"మీ నాన్న మాటమీద నిలబడే మనిషని మీకు తెలుసుకదా! చివరిసారిగా ఆయనిచ్చిన మాటను నిలబెట్టటం మన బాధ్యత"

"అలా సాయంచేసే అప్పులు పెరిగాయి. దేనికైనా హద్దుండాలి. నాన్నగారు చెప్పినట్లు రైస్ మిల్లులోనే పెళ్లి చెయ్యమను. ఆ ఖర్చు ఒక



## అంజనా సంబరం

రవితేజ హీరోగా వచ్చిన 'డాన్‌శీను' సినిమా ద్వారా పరిచయమైన ముంబయ్ ముద్దుగుమ్మ అంజనా సుఖానీకి టాలీవుడ్‌లో అవకాశాలు లేకపోయినా బాలీవుడ్ నుంచే మళ్లీ పిలుపొచ్చిందిట. గతంలో సల్మాన్ ఖాన్ 'సలామ్-ఎ-ఇష్క్' సినిమాలో నటించిన అంజనా సుఖానీ అందులో సల్మాన్‌తో కలిసి మాత్రం కనిపించలేకపోయింది. కానీ ఈసారి ఆమె ఏకంగా అతనికి జంటగా నటించబోతోందిట. 'డాన్ శీను'నే హిందీలో సల్మాన్‌తో నిర్మించే సన్నాహాలు చేస్తున్నారట. ఇందులో తెలుగులో ఆమె ధరించిన పాత్రనే హిందీలోనూ పోషించబోతోందిట. దాంతో తెగ సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతోంది అంజనా.

రకంగా ఇచ్చినట్లేకదా. కాదంటే ఈ వెయ్యి రూపాయిలు ఇవ్వు" అంటూ మరోమాటకు అవకాశం లేకుండా రెండు ఐదొందల నోట్లు తల్లి చేతిలో పెట్టాడు పెద్దకొడుకు వినయ్.

వర్ధనమ్మ ప్రాన్పడిపోయింది. ఎదురుగా గోడ మీద ఉన్న భర్త ఫోటో వైపు చూసింది సాలోచనగా.

కొడుకులను కాదని తన భర్త సొమ్ము తనిష్టం అని సాయం చేయొచ్చు. కానీ అది తనకు కొడుకులకు మధ్య అంతరాన్ని సృష్టిస్తుంది. అది ఆమెకిష్టం లేదు.

కానీ ఆమె కళ్ళముందు రాజారావు మంచితనం కన్పిస్తుంది. ఈ పదిరోజులూ తమక్రింద పనిచేసే ఉద్యోగిలా కాక సొంతమనిషిలా పనులు నిర్వర్తించాడు. పైగా భర్త ఎప్పుడూ అతడి గురించి మంచిగా చెబుతుండటం, అతడు ఇంటికి సంబంధించిన వ్యవహారాలు సమర్ధవంతంగా నిర్వహిస్తుండటంతో రాజారావుపట్ల ఆమెకు సదభిప్రాయం, సానుభూతి ఉన్నాయి.

పైగా సాయం చేస్తానన్న భర్తమాట నిలబెట్టాలి ఎలా? ఆలోచించసాగింది.

మర్నాడు ఉదయాన్నే కొన్ని రికార్డులు తీసుకుని రాజారావు వచ్చాడు.

"ఒక పదిహేనురోజులు సెలవుకావాలి. అవసరమైతే రోజూ కాసేపు మిల్లుకు వస్తాను" అంటూ ఏదో చెప్పబోయాడు రాజారావు.

"సరే! మీ అమ్మాయి పెళ్ళికేగా సెలవు. రైస్‌మిల్లులోనే పెళ్ళి చేయి. ఆ ఖర్చన్నా తగ్గుతుంది" అంటూ అతడి చేతిలోనుండి రికార్డులు తీసుకుని చూడసాగాడు వినయ్.

"అమ్మతో చెప్పి వెళ్ళు" అన్నాడు విజయ్ తామిచ్చిన వెయ్యి రూపాయలు తల్లి ఇస్తుందన్న ఉద్దేశ్యంతో.

వర్ధనమ్మ గది దగ్గరకు వెళ్ళి చిన్నగా తలుపు తట్టాడు రాజారావు.

లోపలి నుండి గడియ తీసిన వర్ధనమ్మ అతడిని లోపలకు పిలిచింది. ఆమె బలవంతం మీద ఆమె ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"ఈ పనుల్లో పడి పెళ్ళి పనులు మొదలుపెట్టలేదనుకుంటా. ఆయన మీ అమ్మాయి పెళ్ళి గురించి చెప్పారు. ఆయనుంటే దగ్గరుండి జరిపించేవారు. ఏ లోటూ లేకుండా పెళ్ళి బాగా జరిపించు" అన్నది వర్ధనమ్మ.

రాజారావు ఏమీ మాట్లాడలేదు. మార్వాడీ అప్పిస్తేనేగా పెళ్ళి.

అతడి సంఘర్షణ ఆమెకు అర్ధమవుతూనే ఉంది.

"ఈ వెయ్యి రూపాయలు ఉంచు" అంటూ చేతిలో డబ్బులు పెట్టింది.

"పెళ్ళి ఇప్పట్లో చేసేదీ లేనిదీ రెండురోజుల్లో చెబు..." అంటుండగానే వర్ధనమ్మ రాజారావు చేతిలో మరోవస్తువు పెట్టింది. అది చిన్న పెట్టె.

ఏమిటది అంటూ మూత తీసి చూసిన రాజారావు నోట మాట రాలేదు.

అందులో లావుపాటి బంగారుగాజుల జత వున్నది.

"అమ్మా ఇవి..."

"నీ కూతురి పెళ్ళికి చేస్తానన్న సాయం గురించి ఆయన నాకు ఆనాడే చెప్పారు. ఆ మాటతో నీవు కొండంత ధైర్యంగా వున్నావు. ఆయన లేకపోతే ఆయన మాట వృధా పోవటానికి వీలు లేదు. గాజులు అమ్మితే ఎంత తక్కువ అంచనా వేసినా యాభై వేలపైనే వస్తాయి. ఈ పెళ్ళి జరిగితే ఆయన ఆత్మ కూడా శాంతిస్తుంది. ఈ సాయం గురించి నీవు నా కొడుకులకు కూడా చెప్పాల్సిన పని లేదు" అన్నది వర్ధనమ్మ.

కొడుకులు సాయం చేయటానికి ఒప్పుకోనప్పుడే ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది.

తనకెంత సొమ్ముందో కచ్చితంగా కొడుకులకు కోడళ్ళకు తెలీదు. తనకు చాలా జతల గాజులున్నాయి. ఒక జత గాజులతో తన భర్త మాట నిలబెట్టవచ్చు.

రాజారావు కళ్ళలో నీళ్ళు, ఎవరికీ తెలియకుండా చేస్తున్న సాయమని అర్ధమైంది.

ఆమె కాళ్ళకు, ముకుందరావు ఫోటోకు నమస్కరించాడు. ఫోటోలోని ముకుందరావు సంతోషంగా నవ్వుతున్నట్లు అన్పించింది వర్ధనమ్మకు.

## సోనియా రీఎంట్రీ

తెలుగులో తొలిచిత్రం 'ధమ్' అయినప్పటికీ '7/జి బృందావన్ కాలనీ'తో వెలుగులోకి వచ్చిన తార సోనియా అగర్వాల్ ఆ తర్వాత కొన్ని తమిళ చిత్రాల్లో నటించింది. దర్శకుడు సెల్వ రాఘవన్‌ని పెళ్లాడి సినిమాలకు స్వస్తి చెప్పిన సోనియా ఇటీవల అతని నుంచి విడాకులు తీసుకుని తిరిగి సినిమాల్లో నటించడానికి సిద్ధమైంది. సోనియా రీఎంట్రీ చేస్తున్న చిత్రం 'వానమ్' (తెలుగు వేదం)లో ఆమె ప్రకాష్‌రాజ్ భార్యగా నటిస్తోందిట. తెలుగులో ఘనవిజయం సాధించిన చిత్రం కాబట్టి తమిళంలోనూ సక్సెస్ అవుతుందని అంచనాలు.

